సాక్షి
కరీంనగర్



మండే సూర్యుడు

ఎండ తీవ్రత కొనసాగుతోంది. భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకు రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. సోమవారం ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల పరిధిలోని గుల్లకోటలో అత్యధికంగా 46.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రలు నమోదు అయ్యాయి. దీంతో ప్రజలు బయటికి వెళ్లేందుకు భయపడ్డారు.

ఉమ్మడి జిల్లాలో సోమవారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు

గుల్లకోట(జగిత్యాల)	46.8
ముత్తారం(పెద్దపల్లి)	46.4
జమ్మికుంట(కరీంనగర్)	46.2
రాజన్న సిరిసిల్ల	44.7

మంగళవారం । 7 । మే । 2024

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

సాక్షిప్రతినిధి,కరీంనగర్: మాడు పగిలే ఎండలతో తల్లడిల్లుతున్న ప్రజలకు భారత వాతావరణశాఖ (ఐఎండీ) చల్లటి కబురు చెప్పింది. మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశాలున్నాయని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.

కేడీసీసీబీ ప్రగతిపై నజర్



కరీంనగర్ అర్బన్: కేడీసీసీబీ నిధుల వినియోగంపై అధ్యయనం చేసేందుకు నాబార్డు కమిటీ సోమవారం కరీంనగర్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు ఎండీ ఎస్.మురళీధర్, నాబార్డు రిటైర్డ్ సీజీఎం సందర్శించి కేడీసీసీబీ సేవలను కొనియాడారు. దేశంలో సహకార సంఘాల బలోపేతానికి మరిన్ని నూతన పథకాలను ప్రవేశపెట్టేందుకు నాబార్డుకు నివేదిక అందిస్తామని వివరించారు. పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీసీసీబీ ప్రగతిని వివరించారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావు, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, దిలీప్, జీఎంలు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలి



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని సోమవారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, నిర్వహణ తీరును అభినందించారు. అనంతరం తాగునీటి సరఫరాపై సమీక్షించారు. గ్రామ పంచాయతీలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, కంపోస్టు స్టాల్, శానిటేషన్, ప్లాంటేషన్, నర్సరీ, కంపోస్టు షెడ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించాలని, తడి పొడి చెత్తను ఇంటింటా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని ఆదేశించారు. ఎంపీడీవో విజయకుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైద్యులపై దాడి అమానుషం'

కరీంనగర్‌టౌన్: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందిపై జరిగిన దాడి అమానుష చర్య అని ఐఎంఏ కరీంనగర్‌శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన ప్రభుత్వ ఆస్తులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్యను తానా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మహేశ్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ డాక్టర్లు బీఎస్.రావు, జగన్మోహన్‌రావు, కిషన్, అలీం, రాజ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిపై రోగి బంధువుల దాడి చేసి, డీజిల్ పోసి హత్యా ప్రయత్నం చేయడం హేయకరమైన చర్య అని కరీంనగర్ ఉమ్మడి జిల్లా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగులు, వృద్ధుల జాబితాను అందజేయాలి

- నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పోలింగ్ కేంద్రాల వారిగా వయోవృద్ధులు, దివ్యాంగుల జాబితాలు అందజేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో మెప్మా అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు వయోవృద్ధులు, దివ్యాంగులను కేంద్రాలకు తరలించేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా సమాఖ్యల పరిధిలో ఉన్న ఆర్‌పీలు దివ్యాంగులు, 60 సంవత్సరాలు పైబడిని వయోవృద్ధులను గుర్తించి జాబితాను సంబంధిత సీవోలకు అందజేయాలన్నారు. ఆ జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు ఆటోల ద్వారా వికలాంగులు, వయోవృద్ధులను తీసుకురావడం, తిరిగి ఇంటికి పంపించడం జరుగుతుందన్నారు. టీఎంసీ అనిత ఉన్నారు.

వరాల జల్లు కురిసేనా?

- జగిత్యాల, పెద్దపల్లి తరహాలో హామీలు దక్కేనా?
- పదేళ్లుగా అమలుకు నోచుకోని హామీలు
- నేడు కరీంనగర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఎస్సారార్ కాలేజీ మైదానంలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఇటీవల జగిత్యాల, పెద్దపల్లికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి వరాలజల్లు కురిపించారు. ఆయా స్థానాల్లో సీఎం ఇచ్చిన హామీ లేవీ కొత్తవి కాదు. ఆ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు వ్యవసాయ, సాగు, తాగు, పారిశ్రామిక ప్రాజెక్టులే. పార్లమెంటు అభ్యర్థుల విజయం కోసం రాష్ట్ర పరిధిలో ఉన్న పలు పెండింగ్ పనులకు వెంటనే హామీలు ఇస్తున్న రేవంత్.. కరీంనగర్ పరిధిలోనూ కొన్ని డిమాండ్లు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిపైనా స్పష్టమైన ప్రకటన చేస్తే లక్షలాది కుటుంబాలకు సాయం చేసినట్లవుతుందని కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. అవేంటంటే..

ఈఎస్ఐ ఆసుపత్రి: ఉమ్మడి జిల్లాలో దాదాపు 30వేలమంది ప్రైవేటు టీచర్లు, 1000 వరకు ఉన్న రైసు మిల్లుల్లో, 20వేలకుపైగా కార్మికులు, దాదాపు లక్ష తొంభై వేల మంది బీడీ కార్మికులు, 370 వరకు గ్రానైట్ క్వారీల్లో 25వేలమంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి సరైన పీఎఫ్, ఈఎస్ఐ సేవలు అందడం లేదు.

- రామగుండంలో చిన్న డిస్పెన్సరీ తప్ప జనాభాకు తగినట్లుగా ఇంతవరకూ ఇక్కడ ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం గమనార్హం. ఆ ఆస్పత్రి ఉన్న విషయం కూడా చాలామంది తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈఎస్ఐ సేవలు పొందాలంటే తప్పనిసరిగా వరంగల్, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది.

ట్రిపుల్ ఐటీ: రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కేంద్రం తెలంగాణకు ట్రిపుల్ ఐటీ కేటాయించింది. దీని అమలులో భాగంగా కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు కావాలి. కానీ, రాష్ట్ర విభజన తరువాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ కళాశాల గుజరాత్‌కు తరలిపోయింది. పదేళ్లుగా ఇక్కడ ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రాజకీయ ప్రసంగాలకే తప్ప ఏర్పాటు దిశగా ఏ పార్టీ మొగ్గు చూపడం లేదు.

రుక్మాపూర్ లెదర్ పార్క్: చొప్పదండి మండలం రుక్మాపూర్ శివారులోని ప్రభుత్వ రిజర్వు భూముల్లో నిర్మించతలపెట్టిన లెదర్‌పార్కుకు దశాబ్దకాలంగా నిధుల కేటాయింపు జరగడం లేదు. అంతర్జాతీయస్థాయిలో తోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ఊదరగొట్టిన ఎన్‌డీఏ, యూపీఏ ప్రభుత్వాలు నిధుల మంజూరులో మొండి చేయి చూపాయి.



- నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ జాతీయస్థాయి పరిశ్రమలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయడం, తరువాత బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది. 20 ఏళ్ల క్రితం రూ.98 కోట్లతో పనులు ప్రారంభించి, విస్తరించేందుకు రుక్మాపూర్ శివారులోని 134ఎకరాల భూమిని కేటాయించిన అధికారులు నాలుగేళ్ల క్రితం ఈ భూములను 40 ఎకరాలకే కుదించి పరిశ్రమల నిర్మాణంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు.

మిడ్‌మానేరు పరిహారమేదీ: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో బోయినపల్లి, వేములవాడ, తంగళ్లపల్లి మండలాలకు చెందిన 12గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 11,750 మంది పీడీఎఫ్ నిర్వాసిత కుటుంబాలు, 141 మంది పీఏఎఫ్ కుటుంబాలు ఉన్నాయి. వీరికి ఇళ్లు, కుటుంబాలు, భూముల పరిహారం తదితర పరిహారాలు ఇచ్చారు. 18ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇచ్చారు. ఇంకా సుమారు రూ.60కోట్ల మేర పెండింగ్ పరిహారం రావాల్సి ఉంది.

- ముఖ్యంగా నిర్వాసితుల ఇళ్ల నిర్మాణానికి రూ.5.04లక్షలు ఇస్తానని మాజీ సీఎం కేసీఆర్ వేములవాడలో హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఒకే ఒక చోట ఇస్తే అన్ని ముంపు ప్రాంతాలలో ఇవ్వాలనే సాకుతో ఇవ్వలేదు. ప్రస్తుతం నిర్వాసితుల ఇళ్లనిర్మాణానికి రూ.5.04 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ ఉంది. పలువురి గెజిట్ మిస్సింగ్, వృత్తి మార్పిడి తదితర సమస్యలు పరిష్కారం కావాల్సి ఉంది.
- మిడ్‌మానేరు నిరసన కార్యక్రమాల్లో నాటి సీఎం కేసీఆర్, నేటి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీలుగా గెలిచిన బండి సంజయ్, పొన్నం ప్రభాకర్, బోయినపల్లి వినోద్‌కుమార్‌లు పాల్గొనడం విశేషంగా చెప్పుకోవచ్చు.

నేదునూరు పవర్ ప్లాంట్: తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామంలో 2006లో జెన్‌కో గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం 436 ఎకరాల భూమిని అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ల్యాండ్ ఆక్వేషన్ చేసి భూ సేకరణ చేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ మరణాంతరం ప్రాజెక్ట్ పెండింగ్‌లో పడింది. దీంతో అప్పట్లోనే రైతులు భూములను తీసుకోవద్దని అధికారులకు అప్పటి మంత్రులకు వినతి పత్రాలు అందించారు.

- 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంట్ పెట్టేందుకు కసరత్తులు చేశారు. నేటికీ ఎలాంటి ప్రాజెక్టు లేకుండా పోయింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రధాన సమస్యలు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అన్ని పార్టీల అభ్యర్థులు, రాజకీయ నాయకులు క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి హామీలు ఇస్తున్నారే తప్పా అమలు చేయడంలో తాత్సరం వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

పక్కాగా ఈవీఎంల కమిషనింగ్

- ఎలాంటి పొరపాట్లు జరగొద్దు
- పకడ్బందీగా మాక్ పోలింగ్
- కలెక్టర్ పమేలా సత్పతి



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్‌ను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలకు సంబంధించి, పాలిటెక్నిక్ కళాశాలలో మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంల కమిషనింగ్‌ను అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు. కమిషనింగ్, బ్యాలెట్ పత్రాల ఏర్పాటు, వీవీప్యాట్స్‌లో సింబల్ లోడింగ్‌పై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వీవీ ప్యాట్స్‌ల్లో జాగ్రత్తగా సింబల్ లోడింగ్ చేయాలని సూచించారు. ఈవీఎంలు సరిగా పని చేస్తున్నాయో లేదో చూసుకోవాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కరీంనగర్ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ యూనిట్స్ 990, కంట్రోల్ యూనిట్స్ 493, వీవీ ప్యాట్స్ 553 రిజర్వ్‌తో కలుపుకుని కేటాయించామని వివరించారు. చొప్పదండి నియోజకవర్గంలో 327పోలింగ్ స్టేషన్లకు 820 బ్యాలెట్ యూనిట్స్, 408 కంట్రోల్ యూనిట్స్, 457 వీవీ ప్యాట్స్, మానకొండూర్ నియోజకవర్గంలో 316 పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ యూనిట్లు 794, కంట్రోల్ యూనిట్లు 395, వీవీ ప్యాట్స్ 442 కేటాయించామని వెల్లడించారు. కమిషనర్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరుస్తారని తెలిపారు. పోలింగ్ ఒక రోజు ముందు వీటన్నింటినీ పోలింగ్ కేంద్రాలకు డిస్ట్రిబ్యూషన్ చేస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు కనకయ్య, రమేశ్, రాజేశ్, నరేందర్, రాజకుమార్ పాల్గొన్నారు.

వానాకాలం సాగు ఖరారు

- ఖరారైన విత్తన, ఎరువుల ప్రణాళిక
- పెరగనున్న పత్తి సాగు.. అపరాలపై దృష్టి
- గతంలో 3.42లక్షల ఎకరాలు.. ప్రస్తుతం 3.45లక్షల ఎకరాలు



కరీంనగర్ అర్బన్: వానాకాలం సాగు ప్రణాళిక ఖరారైంది. జిల్లా వ్యవసాయశాఖ గత అనుభవాలు, ప్రభుత్వ ఆదేశాల క్రమంలో అంచనా నివేదికలు రూపొందించింది. జిల్లావ్యాప్తంగా గత వానాకాలంలో 3,42,919 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా ఈ సారి 3,45,070కు చేరింది. ఏఈవో నుంచి ఏవో తదుపరి వ్యవసాయ డివిజన్లలో ప్రణాళికను రూపొందించగా సదరు వివరాల క్రోడీకరణ క్రమంలో జిల్లా ప్రణాళికను రూపొందించారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ వ్యవసాయ డివిజన్లుండగా పలు చోట్ల వరికి, మెట్టప్రాంతాల్లో పత్తికి ప్రాధాన్యతనిచ్చారు. మొత్తంగా అన్ని రకాల ఎరువులు కలిపి 77వేల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా రూపొందించగా ఆయా రకాల విత్తనాలకు 69,211 క్వింటాళ్లు అవసరంగా గుర్తించారు.

ఎరువుల ప్రణాళిక ఇలా

ఎరువు	మెట్రిక్ టన్నులు
యూరియా	44,353
డీఏపీ	6,559
కాంప్లెక్స్	20,765
ఎంవోపీ	6,433

విత్తన అవసరం ఇలా

వరి	68,625క్వింటాళ్లు
మొక్కజొన్న	360
పెసలు	44
కందులు	60
వేరుశనగ	120
పత్తి	1,12,500

ఏటా పెరుగుతున్న వరి సాగు

వరి సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. గత నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వరి సాగు వద్దని స్పష్టం చేయగా విస్తీర్ణం తగ్గగా రెండేళ్ల నుంచి విపరీతంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఇక గత రెండేళ్ల క్రితంతో పోల్చితే పత్తి సాగు విస్తీర్ణం తగ్గుతుండగా మొక్కజొన్న సాగు అంతంతమాత్రమే. ఒకప్పుడు పత్తి లక్ష ఎకరాల్లో సాగవగా మొక్కజొన్న 50వేల ఎకరాల్లో సాగయ్యేది. తాజా గణాంకాల ప్రకారం గణనీయంగా తగ్గింది. ఏటా అపరాలు, తృణధాన్యాల సాగు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేస్తున్నా అన్నదాతల్లో మార్పు లేకపోవడంతో అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. రైతుల అభీష్టం మేరకు అంచనాలు రూపొందిస్తున్నారు.

వానాకాలం సాగు అంచనా (ఎకరాల్లో)

పంట	గతసాగు (2023)	ప్రస్తుత అంచనా(2024)
వరి	2,74,476	2,74,500
పెసర	43	550
మొక్కజొన్న	3,137	4,500
కందులు	935	2,000
ఉలవలు	41	25
పప్పుదినుసులు	10	15
పత్తి	45,875	48,000
వేరుశనగ	128	200
పొగాకు	9	100
మిర్చి	1,028	1,000
పసుపు	10	50

సాగులోకి బీడు భూములు

పాత కాల్వల ఆధునీకరణ జరగడం, మధ్య మానేరు పూర్తవడం, వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగుకు ఢోకా లేకుండా పోయింది. గత నాలుగేళ్లుగా నీటి కొరత లేకపోగా చాలామంది రైతులు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, జమ్మికుంట, ఇల్లందకుంట, రామడుగు, గంగాధరలోని పలు ప్రాంతాల్లో బీడు భూములుండగా ఇపుడవి సాగుకు యోగ్యంగా మలచుకున్నారు. దీంతో వేల ఎకరాల్లో అదనంగా పంటలు సాగవనున్నాయి.

మోదీ గుండెలో సంజయ్‌కి ప్రత్యేక స్థానం



జమ్మికుంటలో జరిగిన బీజేవైఎం యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న అన్నామలై

- బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

హుజూరాబాద్: ప్రధాని మోదీ గుండెలో బండి సంజయ్‌కుమార్‌కు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ ఆఫీసర్ అన్నామలై అన్నారు. సంజయ్ పాదయాత్ర స్ఫూర్తితోనే తమిళనాడులో తాను పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. సోమవారం జమ్మికుంటలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి జైలుకు వెళ్లిన చరిత్ర సంజయ్‌కే సొంతమన్నారు. బండి గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనని, మొత్తం పోలైన ఓట్లలో 60 శాతం బీజేపీకి పడేలా ఇంటింటికీ తిరిగి గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు.

గ్యారంటీలను విస్మరించిన కాంగ్రెస్

కాంగ్రెస్ ఆరుగ్యారంటీల పేరుతో ఓట్లు దండుకుని గద్దె నెక్కాక వాటిని పూర్తిగా విస్మరించిందని అన్నామలై అన్నారు. అబద్ధాల పునాదులపైనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గుజరాత్‌తో తెలంగాణ పోటీ అంటున్న రేవంత్‌రెడ్డి అక్కడ సబర్మతి నదిని ఎలా ప్రక్షాళన చేశారో ఇక్కడ మూసీ నదిని మీరెందుకు ప్రక్షాళన చేయలేదని, తమిళనాడులో పంట నష్టపోతే పరిహారం అందిస్తామని, తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సంజయ్ నాయకత్వంలో పోరాటాలే కాదు, కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. 'మోదీ కోసం 5 రోజులు కష్టపడండి.. మోదీ మీకోసం 5 ఏళ్లు కష్టపడి 'సేవ చేస్తారు' అని ఊరూరా ప్రచారం చేస్తూ బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

మోదీ వేములవాడకు నిధులు ప్రకటించాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



వేములవాడలో మాట్లాడుతున్న వినోద్

వేములవాడ: ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిని రూ.వందల కోట్లతో అభివృద్ధి చేసినట్లుగానే.. దక్షిణకాశీగా ప్రఖ్యాతిగాంచిన వేములవాడ అభివృద్ధికి కనీసం రూ.ఐదున్నర కోట్లయినా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి వేములవాడలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తెచ్చానని తెలిపారు. రైతుకు పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వం దేశంలోనే కేసీఆర్ సర్కారు మాత్రమేనని అన్నారు. నార్లు పోసేటప్పుడు ఇవ్వాల్సిన రైతుబంధు కాంగ్రెస్ ప్రభుత్వం కోతల సమయంలో ఇస్తుందని విమర్శించారు. నాలుగు నెలల కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే ప్రాజెక్టులు, చెరువులు ఎండిపోయి కరువు వచ్చిందన్నారు. బండి సంజయ్ పార్లమెంట్‌లో ఎప్పుడు కూడా రాష్ట్రం కోసం ఒక్క మాట మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. వేములవాడ రాజన్న గుడికి నయాపైసా తెచ్చాడా అని ప్రశ్నించారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

- ప్రధాని మోదీ పచ్చి అబద్ధాల కోరు
- ఇండియా కూటమి అభ్యర్థులనే గెలిపించండి
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



సభలో మాట్లాడుతున్న కె.నారాయణ

కరీంనగర్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీపీఐ ముఖ్య నాయకులతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ.. అబద్ధాలకోరు నరేంద్రమోదీ అని, మతోన్మాద ముసుగులో దేశాన్ని పాలిస్తున్న బీజేపీని ఇంటికి సాగనంపాలని సూచించారు. ప్రధాని మోదీ తనకు కుటుంబమే లేదంటాడు కానీ ఆయనకు 29మంది దత్త పుత్రులు ఉన్నారని, వారంతా గుజరాత్ బ్యాంకుల్లో లక్షల కోట్లు అప్పులు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారని విమర్శించారు. పదేళ్లల్లో ఇచ్చిన వాగ్దానాలను ఆటకెక్కించి, హామీలను అమలు చేయకుండా ఆయోధ్య పేరుతో రాముడి పేరుచెప్పి ఓట్లు దండుకునే కుట్రను ప్రజలు గ్రహించారని ధ్వజమెత్తారు. ప్రధానిగా ఉంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మోదీ రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేస్తామనడం ప్రజాస్వామ్య ప్రక్రియకే విఘాతమని అన్నారు. గంజాయి స్మగ్లరైన అదానీ నేడు కోట్లకు ఎలా అధిపతి అయ్యాడని విమర్శించారు. నరేంద్ర మోదీకి వివాహవ్యవస్థపై గౌరవం లేదని, తాళి విలువ తెలియదని ఎద్దేవా చేశారు. ఆలిని ఏలుకోనోడు దేశాన్ని ఎలా పాలించగలుగుతాడని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి కృషి చేయలేని బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని ఓడించి సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చురుగ్గా వ్యవహరించిన బండి సంజయ్‌ని పార్టీ అధిష్ఠానం ఎందుకు ఆ పదవి నుంచి దించిందో అందరికీ తెలుసన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, సిద్దిపేట, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, కర్రె భిక్షపతి, గుంటి వేణు, వెన్న సురేశ్, తాండ్ర సదానందం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గడిపే మల్లేశ్, ఆదరి శ్రీనివాస్, కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

రేపు రాజ్యాంగ రక్షణ సభ



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌లో ఈనెల 8న రాజ్యాంగ రక్షణ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం తెలిపారు. సోమవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్రచేస్తోందన్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్‌ల రద్దుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చేసిన తీర్మాన ప్రతులు తమ వద్ద ఉన్నాయని, రాజ్యాంగ రక్షణ సభలో వాటిని బహిర్గతం చేస్తామన్నారు. ఇందుకు బీఆర్ఎస్ కూడా మద్దతిస్తుందని, అందుకే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నోరు మెదపడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, ఆ వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లు తొలగించాలని బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. గజ్జెల ఆనందరావు, అజయ్, కొండ్ర స్వరూప, లక్ష్మణ్, శంకర్, శంకర్ ఉన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో మహిళ మృతి



జగిత్యాలక్రైం: వడదెబ్బకు గురైన జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన సంగెపు గంగరాజు (41) చికిత్స పొందుతూ మృతిచెందింది. గంగరాజు మూడు రోజుల క్రితం తక్కళ్లపల్లిలో జరిగిన బోనాల పండుగలో పాల్గొంది. బోనం ఎత్తుకుని ఎండలో ఉండగా.. తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మోతె గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ధర్మపురిలో వృద్ధుడు..



ధర్మపురి: వడదెబ్బకు గురై వృద్ధుడు మృతి చెందిన సంఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ఎండీ.జమాల్ (80) ఆదివారం వడదెబ్బకు గురై రాత్రి వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతురున్నారు.

తీగెల వంతెనపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ తీగెల వంతెన మీద నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారుగా 35–40 ఏళ్లు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిస్తే ఎస్‌హెచ్‌వో సెల్‌నంబర్ 8712670764, పోలీస్‌స్టేషన్ నంబర్ 8331940590లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చిత్తుగా తాగి.. రూ.200 కోసం ఘర్షణ పడి..



ముత్తారం(మంథని): చిత్తుగా మద్యం తాగి ఆ మత్తులో ఇద్దరు దాడి చేసుకున్నారు. వారిని వారించే క్రమంలో మరో వ్యక్తికి బీరుసీసా గుచ్చుకుని తీవ్రంగా గాయపడ్డాడు. మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాపులో సోమవారం ఈఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారం మల్లారెడ్డి, పింగిళి ప్రభాకర్‌రెడ్డి, మరి కొందరు కలిసి వైన్స్ షాపు వెనకాల ఓ గదిలో మద్యం తాగుతున్నారు. ఆ మత్తులో రూ.200 కోసం ఇద్దరూ గొడవపడుతున్నారు. పరస్పరం తన్నుకుంటూ బీరుసీసాలతో దాడులకు దిగారు. ఈక్రమంలో కేశనపల్లికి చెందిన ఎండీ షరీఫ్ ఆ గొడవ ఆపే ప్రయత్నం చేశారు. దీంతో బీరుసీసా అతడి మెడకు గుచ్చుకుని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రగాయాలైన షరీఫ్‌ను 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఫిర్యాదు అందలేదని ఎస్సై మధూసూదన్‌రావు తెలిపారు.

వైభవంగా మహాలింగార్చన



దీపాలు వెలిగిస్తున్న అర్చకులు, భక్తులు

వేములవాడ: మాసశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా జరిగింది. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

సార్వత్రిక సమరం.. కసరత్తు ముమ్మరం

- రెండో ర్యాండమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియ పూర్తి
- స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	బీయూ	సీయూ	వీవీ ప్యాట్
కరీంనగర్	395	990	493	553
చొప్పదండి	327	820	408	457
మానకొండూర్	316	794	395	442
హుజూరాబాద్	305	780	368	420



ఈవీఎంలను బాక్సుల్లో సిద్ధం చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇటీవల నామినేషన్ల సమర్పణ, ఉపసంహరణ క్రతువు ముగియటంతో కరీంనగర్ లోక్‌సభ బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారైంది. ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాల వారీగా అధికారులు ఈవీఎంలను కేటాయించారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో పోటీ చేస్తుండటంతో అదనంగా ఈవీఎంలను తెప్పించారు. సదరు యంత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవల్ చెకింగ్‌తో పాటు రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా శాసనసభ నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. మరోవైపు పోలింగ్ సిబ్బంది, సూక్ష్మపరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసిన అధికారులు ఈనెల 13న జరిగే పోలింగ్‌కు సమాయత్తమవుతున్నారు.

టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ నియామకం

పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలగకుండా అధికారులు శాసనసభ నియోజకవర్గాల వారీగా అదనపు ఈవీఎంలను కేటాయించారు. వీటిని పోలింగ్ రోజు ఆయా సెగ్మెంట్లలో విధులు నిర్వర్తించే సెక్టోరల్ అధికారులకు అప్పగించనున్నారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే వేరే వాటిని సెక్టోరల్ అధికారులు అమర్చుతారు. ఇలా ఒక్కో సెక్టోరల్ అధికారికి 2–3 ఈవీఎంలను అధికారులు అప్పగిస్తారు. ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున సాంకేతిక నిపుణులను ఈసీ నియమించింది. ఈవీఎంలలో సమస్యలు తలెత్తితే సాంకేతిక నిపుణులు వెంటనే సరిచేస్తారు.

ముగిసిన రెండో విడత ర్యాండమైజేషన్

ఇప్పటికే మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేయగా అదనంగా అవసరమైన ఈవీఎంలకు కలిపి రెండో విడత ర్యాండమైజేషన్ ముగించిన అధికారులు వాటిని పటిష్ట భద్రత మధ్య శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించనున్నారు. అభ్యర్థుల జాబితా ప్రకారం ఇటీవల బ్యాలెట్ పేపర్ ముద్రించారు. ప్రస్తుతం ఈ పేపర్‌ను బ్యాలెట్ యూనిట్లలో పొందుపరుస్తున్నారు.

కరీంనగర్‌కు రెండు బ్యాలెట్ యూనిట్లు

కరీంనగర్ లోక్‌సభ బరిలో 28 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16 బటన్లుంటాయి. ఈ లెక్కన కరీంనగర్ లోక్‌సభ స్థానంలోని ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నారు. వీటితో పాటు ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ అవసరం. నామినేషన్ల సమయంలోనే అధికారులు ఈవీఎంలను సిద్ధం చేసి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ముగించారు. అభ్యర్థుల సంఖ్యకనుగుణంగా యంత్రాలను కేటాయించారు. పోలింగ్ రోజు సాంకేతిక సమస్యలు తలెత్తినా అంతరాయం కలగకుండా 25 శాతం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం వీవీప్యాట్లను అదనంగా అందుబాటులో ఉంచారు.

పోలీసుల తనిఖీ.. నగదు పట్టివేత



తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్రమ డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. నగరంలోని వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ పరిధిల్లోని బస్‌స్టాండ్‌ఏరియా, కమాన్‌చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తాతో పాటుగా కమిషనరేట్ వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

నగరంలో రూ. 5.32 లక్షలు..

నగరంలో సోమవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వేర్వేరు చోట్ల రూ.5.32 లక్షలు పట్టుబడినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ త్రీ టౌన్ పరిధిలో సుభాష్‌నగర్ వద్ద తీగలగుట్టపలికి చెందిన వొడ్నాల రవీందర్ వద్ద నుంచి రూ.3,32,000, వావిలాలపల్లిలో గౌతమినగర్‌కు చెందిన పింగిలి విష్ణువర్ధన్ రెడ్డి నుంచి రూ2,00,000 పట్టుబడగా మొత్తం డబ్బును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి తెలిపారు.

జగిత్యాలలో రూ.5.70 లక్షలు..

జగిత్యాలక్రైం: జగిత్యాల తహసీల్‌చౌరస్తా వద్ద మధ్యాహ్నం ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా హబ్సీపూర్ గ్రామానికి చెందిన మహిపాల్ ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.40 లక్షలు సీజ్ చేశారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన రాములు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.30 లక్షలు సీజ్ చేశారు. భీష్మనగర్‌కు చెందిన శంకర్ తీసుకెళ్తున్న రూ.2లక్షలు సీజ్ చేశారు.

సైదాపూర్ మండలంలో..

సైదాపూర్(హుస్నాబాద్): ఎలబోతారంలో రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా రూ.1.28 లక్షలు సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై ఆరోగ్యం తెలిపారు. బెజ్జంకికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బు తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.

ప్రధాని రాక కోసం..

- వేములవాడలో భారీ ఏర్పాట్లు
- పోలీసుల నిఘాలో పట్టణం.. డ్రోన్లపై నిషేధం
- గుడి చెరువు ఖాళీ స్థలంలోకి అనుమతి నిరాకరణ



బాలానగర్ వద్ద ప్రధాని సభ ఏర్పాట్లు

వేములవాడ: వేములవాడకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ వస్తుండడంతో రాజన్న ఆలయంతోపాటు ఆలయ పరిసరాలు, పట్టణం మొత్తం పోలీసు వలయంలోకి వెళ్లాయి. ఎస్పీజీ పోలీసులు, ప్రత్యేక పోలీసు బలగాలతో సోమవారం నుంచి ప్రత్యేక నిఘా పెంచారు. ఈనెల 8న ప్రధాని నరేంద్రమోదీ వేములవాడలో పర్యటిస్తుండడంతో పోలీస్‌శాఖ భారీ బందోబస్తు చర్యలు తీసుకుంటుంది. ముందుగా రాజన్నను దర్శించుకున్న అనంతరం బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు.

పోలీసుల నిఘా మధ్య వేములవాడ

వేములవాడ పట్టణం, ఆలయ ప్రాంతం, పరిసర ప్రాంతాలు పోలీసుల నిఘాలో ఉన్నాయి. ఆలయానికి వచ్చే మార్గాల్లో పోలీసుల ఆంక్షలు పెరిగిపోయాయి. ఆలయం చుట్టూ ఉన్న నివాసాలు, దుకాణాల వివరాలు, పరిసర కాలనీల్లోని ప్రజల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఎస్పీజీ పోలీసులు, ప్రత్యేక పోలీసులతో వేములవాడ పట్టణం పోలీసుల చేతుల్లోకి వెళ్లింది. గుడి చెరువు ఖాళీ స్థలంలోకి ఎవరినీ అనుమతించడం లేదు.

మూడు రోజులు డ్రోన్లు నిషేధం

సోమవారం ఉదయమే హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించింది. ఏరియల్ వ్యూ, భద్రత చర్యలను ప్రత్యేక బలగాలు తీసుకుంటున్నాయి. ప్రధాని పర్యటన సందర్భంగా వేములవాడలో మూడు రోజులపాటు డ్రోన్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం ప్రకటించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎండనూ లెక్కచేయని భక్తులు





రాజన్న ఆలయంలో భక్తులు, ఆలయ ముఖద్వారం వద్ద స్లిప్పులతో నిరసన తెలుపుతున్న గడ్డిదాతలు

- రాజన్నను దర్శించుకున్న 25 వేల మంది
- రూ.35 లక్షల ఆదాయం
- దర్శనం కల్పించకపోవడంపై గడ్డిదాతల నిరసన

వేములవాడ: రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేములవాడలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనప్పటికీ తమ ఇలవేల్పునకు మొక్కులు చెల్లించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. గోశాలలోని ఆవుల కోసం గడ్డి అందజేసిన రైతులకు రాజన్న దర్శనం కల్పించడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు రైతులు నిరసన తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద రైతులు లింగాల పద్మారెడ్డి, పందిరి గణేశ్, పల్లెపు రాజు, బాదినేని రాజంలు గోశాల అధికారులు ఇచ్చిన స్లిప్పులతో నిరసన తెలిపారు.

గౌడ కులస్తుల సమస్యలపై మంత్రి పొన్నం ఏనాడు మాట్లాడలేదు

- గౌడ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు రంగు సంపత్‌గౌడ్



మాట్లాడుతున్న సంపత్‌గౌడ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో రెండుసార్లు ఓటమిపాలైన పొన్నం ప్రభాకర్‌కు ఇక్కడ మొఖం చెల్లక, గౌడ కులస్తుల ఓట్లు దండుకోవడానికి హుస్నాబాద్ వెళ్లాడని, మాయమాటలతో గౌడ కులస్తుల ఓట్లతో గెలిచి మంత్రిగా కొనసాగుతున్న పొన్నం ప్రభాకర్ వారి సమస్యల కోసం ఎప్పుడైనా మాట్లాడారా.. కొట్లాడారా..? అని బీజేపీ నాయకుడు, గౌడ జాగృతి కల్లు గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగు సంపత్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ మంత్రి పొన్నంకు గౌడ కులస్తుల సమస్యలు పట్టవన్నారు. గతంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, పార్లమెంటు సభ్యుడిగా ఉన్న ప్రభాకర్ ఏ రోజు గౌడ కులస్తుల సమస్యల కోసం మాట్లాడలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉండి మంత్రి హోదాలోనూ గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన చేయకపోవడాన్ని ప్రతీఒక్కరు గమనించాలన్నారు. బీసీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌పై వ్యక్తిగత, అనవసర దూషణలు చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీసీ సమాజం పొన్నంకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు ప్రకాశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దగ్ధమైన పశుగ్రాసం, పైపులు

- నాలుగు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు
- రూ.7లక్షల వరకు ఆస్తినష్టం



తిమ్మాపూర్‌లో దగ్ధమైన గుడిసెలు, గడ్డివాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని నాలుగు గ్రామాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు జరిగి భారీ ఆస్తి నష్టం ఏర్పడింది. పశుగ్రాసం, గుడిసెలు, విద్యుత్ మోటార్ల పైపులు కాలి బూడిదయ్యాయి. సిరిసిల్ల నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ అప్పటికే నష్టం జరిగింది. రైతులకు దాదాపు రూ.7లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన పట్వారి బాలయ్య, రమేశ్, కుర్మ శంకర్, అల్లె నర్సయ్య, కొలకాని దేవయ్యలకు చెందిన మోటార్ల పైపులు, గడ్డివాములు, పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న గుడిసెలు, విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కాలిపోయాయి. నారాయణపూర్ శివారులోని శీతాలబండ పరిసరాల్లో కొయ్యకాళ్లకు మంటలు వ్యాపించి సమీపంలో నిల్వచేసిన పశుగ్రాసం కాలిపోయింది. మంటలు సమీపంలోని కోళ్లఫారం, ఐకేపీ కొనుగోలు కేంద్రం వరకు వ్యాపించడంతో రైతులు చెట్ల కొమ్మలతో అదుపులోకి తెచ్చారు. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న పదిర శివారులోని అర్బన్‌పార్క్ సమీపంలో మంటలు వ్యాపించాయి. తిమ్మాపూర్‌లో భారీ నష్టం జరిగింది. బాధిత రైతులను ఆదుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అందె సుభాష్ కోరారు.

బీజేపీకి దమ్ముంటే రైతు ఆత్మహత్యలపై కమిషన్ వేయాలి

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి




హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మురళి

హుజూరాబాద్/జమ్మికుంట: పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీకి దమ్ముంటే రైతు ఆత్మహత్యలపై కమిషన్ వేయాలని, వ్యవసాయ రంగానికి అన్యాయం చేసినందుకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక, తెలంగాణ జాగో వేదిక నాయకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి అన్నారు. టీఎస్‌డీఎఫ్ జాగో తెలంగాణ ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్య బస్సు యాత్ర సోమవారం హుజూరాబాద్, జమ్మికుంటలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో నల్ల చట్టాలను తెచ్చి ఎందరో రైతుల ఆత్మహత్యలకు కారణం బీజేపీ కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి సేవలు చేసిన స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి ఆయన సిఫార్సులను పట్టించుకోకపోవడం ద్వంద నీతికి నిదర్శనమన్నారు. దేశభక్తి గల మన సైన్యం ఉన్నంతకాలం పాకిస్తాన్ లాంటి చిన్న దేశంతో మనకేలాంటి ప్రమాదం ఉండదని, దేశ సైనికుల సాహసాలను పార్టీ కోసం ఉపయోగించుకునే నీచ సంస్కృతి బీజేపీదేనని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ రాష్ట్రాల్లో అల్లకల్లోలాలు సృష్టించి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను అక్రమంగా పడగొట్టిన బీజేపీ నైతిక విలువల గురించి మాట్లాడడం దురదృష్టకమన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ పద్మజ, షాహ, ఎన్నారై రాయదాస్, న్యాయవాది ఝాన్సీ పాల్గొన్నారు.

ముగ్గురిపై వరకట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకరావాలని వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. కొత్తపల్లికి చెందిన కర్రు లక్ష్మీప్రసన్నకు గోదావరిఖనికి చెందిన ప్రణీత్‌కుమార్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజులుగా అదనంగా రూ.50 లక్షలు కట్నం తీసుకరావాలని భర్త, అత్తమామలు కృష్ణకుమారి, నాగయ్య వేధింపులకు గురిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



జమ్మికుంట/ఓదెల: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండల పరిధిలోని బిజిగిరి షరీఫ్, పోత్కపల్లి రైల్వేస్టేషన్ మధ్య ఎగువ మెయిన్ లైన్‌లో గూడ్స్ రైలుకింద పడి గుర్తు తెలియని 60 ఏళ్ల వయస్సుగల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. ఆరెంజ్ బ్లాక్, వైట్ చెక్స్ ఫుల్ షర్ట్, బ్లూ బ్లాక్ చెక్స్ డిజైన్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపచామని, మృతుడి వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్



కరీంనగర్‌కల్చరల్: దేశంలో బీజేపీ, కాంగ్రెస్ ఎజెండా ఒక్కటే అని, ఆ రెండుపార్టీల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగాన్ని మారుస్తారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మందప్రభాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థి మారెపెల్లి మొగిలయ్య తరపున స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. బీజేపీ గెలిస్తే బహుశా ఇవే చివరి ఎన్నికలని అనుమానం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీని నెరవేర్చలేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడని ప్రశ్నించారు. బీఎస్పీ అభ్యర్థి మొగిలయ్యను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం, పార్లమెంట్ ఇన్‌చార్జి అంకని భాను, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, ఎనగందుల వెంకన్న, మాతంగి అశోక్, దొడ్డ శ్రీనివాస్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థితో పాటు మరొకరిపై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: సంబంధిత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసిన విషయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలచాల రాజేందర్‌రావుతో పాటు ఏడో డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావు, కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్‌లు ఈనెల ఐదో డివిజన్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమందిని సమావేశపరిచి మీటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహించారని ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఆ ప్రాంత ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బి.రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ తెలిపారు.

రామయ్యపల్లెలో చోరీ

ధర్మపురి: ఇంటి తాళాలు తీసి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన ధర్మపురిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని రామయ్యపల్లెకు చెందిన ఉరిడి జయాకర్ ఆదివారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిముందే పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు తీసి ఇంట్లోని బీరువాలో ఉన్న 5.5తులాల బంగారం, 45 తులాల వెండి, రూ.10వేల నగదు దోచుకెళ్లారు. జయాకర్ సోమవారం ఉదయం లేచి చూడగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, వెండి, నగదు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఉదయ్‌కుమార్ సంఘటనస్థలానికి వెళ్లి పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన ప్రైవేట్ పంపు ఆపరేటర్ నేరెల్ల సంపత్‌కుమార్(43) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరెల్ల సంపత్‌కుమార్ చేగుర్తిలోని సుజల స్రవంతి పథకంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఇరుకుల్లలో జరిగిన శుభకార్యానికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్లి తిరిగి వచ్చేందుకు రాజీవ్‌రహదారిలో ఇరుకుల్ల యూటర్న్ వద్ద మలుపు తిరిగేందుకు వెళ్తుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు టీవీఎస్‌ను బలంగా ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలైన సంపత్‌ను స్థానికులు చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం సంపత్ మృతి చెందాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు అజయ్, అనిల్ ఉన్నారు. అజాగ్రత్తగా కారు నడిపిన డ్రైవర్ అఖిల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిడ్‌మానేరు నీటి గుంతలో పడి యువకుడి మృతి

- స్నానానికని వెళ్లి ఈతరాక మృతిచెందిన వైనం
- మృతుడు చందుర్తి మండలం జోగాపూర్ వాసి



బోయినపల్లి(చొప్పదండి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక శివారులోని మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటిగుంతలో పడి చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన యువకుడు పుల్లయ్య(20) సోమవారం మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపిన వివరాలు. పుల్లయ్య తన తల్లితో కలిసి వేములవాడలో నివసిస్తున్నాడు. ఆరు నెలలుగా కొదురుపాకకు చెందిన కల్లెం రాజయ్య వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీరు తగ్గడంతో అక్కడక్కడ గుంతల్లో నీరు నిలిచి ఉంది. ఈ క్రమంలో పుల్లయ్య గ్రామానికి చెందిన సాయిలుతో కలిసి మిడ్‌మానేరు పరిసరాలకు వెళ్లాడు. మధ్యాహ్నం స్నానం చేస్తానని చెప్పి నీటిగుంత వద్దకు వెళ్లాడు. కాగా చాలా సమయం గడిచినా పుల్లయ్య రాకపోవడంతో సాయిలు నీటిగుంత పరిసరాల్లో చూశాడు. అక్కడ చెప్పులు, కట్టె కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. మత్స్యకారులు తెప్పెతో నీటి గుంతలో వెతికి పుల్లయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. నీటిగుంతలో స్నానానికని వెళ్లి ఈతరాక తన కుమారుడు మృతి చెందాడని తల్లి వజ్రవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
మంగళవారం ॥ 7-5-2024



కన్యాకుమారిలో సృష్టి బక్షి పాదయాత్ర మొదలుపెట్టినప్పటి చిత్రం

డాక్యుమెంటరీ



తమిళనాడులోని ఒక బామ్మతో మాట్లాడుతూ...

కలిసి నడిచే గొంతులు

**కన్యాకుమారి నుంచి
శ్రీ నగర్ వరకూ
260 రోజుల పాటు
3,800 కిలోమీటర్లు
దేశమంతా నడిచింది
సృష్టి బక్షి.
ఎందుకు?
స్త్రీలపై జరిగే దురాగతాలపై
చైతన్యం కలిగించడానికే కాదు
స్త్రీల శక్తియుక్తులను వారికి గుర్తు చేయడానికి.
ఆ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు
'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో
అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది.
నటి ప్రియాంకా చోప్రా నిర్మాత.**

తాను నడిచి చేరుకున్న ఊరిలో ఏదైనా స్కూల్‌లోగాని, పబ్లిక్ హాల్‌లో కాని మహిళలను పోగు చేస్తుంది సృష్టి బక్షి. 'అందరూ కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదలండి' అంటుంది. 'ఇప్పుడు మీ కళ్ల ఎదురుగా మీ 11 ఏళ్ల వయసున్న మీ రూపాన్ని గుర్తు చేసుకోండి. ఆ 11 ఏళ్ల అమ్మాయిలో ఉండే విశ్వాసం, ఆనందం ఎన్ని విధాలుగా ధ్వంసమైందో గుర్తుకు తెచ్చుకోండి. ఆ అమ్మాయికి సారీ చెప్పండి. ఎందుకంటే ఆ విధ్వంసమంతా మీ అనుమతితోనే జరిగింది' అంటుంది. చాలామంది ఆ మాటలకు ఏడుస్తారు. గడిచివచ్చిన జీవితాన్ని తలుచుకుని బాధలో మునిగిపోతారు. అప్పుడు సృష్టి బక్షి ఒక బోర్డు మీద స్త్రీ శరీర నిర్మాణం గీచి 'ఇదిగో ఈ అవయవాల రీత్యా మీరు మగవారి కంటే భిన్నంగా పుట్టారు. ప్రకృతి ఈ అవయవాలను మీకు ఇస్తే సమాజం అదుపు, ఆంక్షలు, వివక్ష, కుటుంబ హింస, ఆర్థిక బానిసత్వం, ఇంటి పని... ఇన్ని ఇచ్చింది. మనం ఎందుకు మగవారితో సమానం కాము?' అని ప్రశ్నిస్తుంది.

మార్పు కోసం

సృష్టి బక్షిది ముంబై. ఆమె హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంది. హాంగ్‌కాంగ్‌లో మార్కెటింగ్‌లో పెద్ద సంస్థల్లో పని చేసింది. తండ్రి ఆర్మీలో పని చేయడం వల్ల ఆమెకు దేశం పట్ల ఒక ఉద్వేగం ఉండేది. అయితే తాను ప్రేమించే దేశంలో స్త్రీలపై జరిగే అన్యాయాలను చూసి చలించి పోయేది. '2017లో హాంకాంగ్‌లో సిటీ బస్ ఎక్కి ఇంటికి వెళుతున్నప్పుడు నా ఫోన్‌లో ఇండియాలో తల్లీ కూతుళ్లపై తండ్రి ఎదుటే అత్యాచారం చేసి చంపేశారన్న వార్త చదివాను. చాలా నిస్పృహ కలిగింది. నాలాంటి వాళ్లు సౌకర్యంగా పడక్కుర్చీలో కూచుని చింతించడం సరికాదని రంగంలో దిగాలని అనుకున్నాను. అలా నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇండియా వచ్చి దేశంలోని స్త్రీలందరితో మాట్లాడాలని 2018 మే నెలలో పాదయాత్ర ప్రారంభించాను' అని చెప్పింది సృష్టి.

రోజూ వేలాది మంది

'ఉమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో సృష్టి బక్షి మే 2018లో కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర రికార్డు అయ్యేలా టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. 260 రోజుల పాటు దాదాపు 4 వేల కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రకు కోటి రూపాయలు ఖర్చవుతాయి. 50 లక్షలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా పోగు చేసింది.

'ఈ యాత్రలో స్త్రీల కలలు, ఆకాంక్షలు, వారి హక్కులు, సంఘర్షణలు. విజయాలు వినదలుచుకున్నాను. వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలనుకున్నాను. నా సుదీర్ఘ యాత్రలో మన దేశంలో వరకట్నం ఇంకా పెద్ద సమస్యగా ఉందని అర్థమైంది. వరకట్నం స్త్రీలను మానసికంగా పురుషులతో సమానం అనుకోనివ్వడం లేదు. స్త్రీలను అసభ్యంగా తాకడం, హింసించడం, అణిచి పెట్టడం కొనసాగుతూనే ఉంది. ఒక దశలో నేను యాత్ర చేయలేననుకున్నాను. కాని ఆ మరుసటి రోజు నా మీటింగ్‌కు హాజరైన ఒక ఆశా వర్కర్– ''రాత్రి నన్ను నా భర్త కొట్టాడు. నీ మాటలు విన్నాక ఇక ఇలాంటిది జరగనివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నేను నా భర్తను నిలువరించడానికి నలుగురి సాయం తీసుకుంటాను'' అని చెప్పింది. నా యాత్ర వల్ల జరుగుతున్న మేలు అర్థమయ్యాక కొనసాగాను' అని తెలిపింది సృష్టి.

డాక్యుమెంటరీ విడుదల

సృష్టి చేసిన యాత్ర అంతా 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో డాక్యుమెంటరీగా రూపొందింది. మే 3 నుంచి అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ డాక్యుమెంటరీ మీద మంచి రివ్యూలు వస్తున్నాయి. 'ఎందరో స్త్రీలు. వారి జీవితానుభవాలను ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. వారు సమస్యలు వారి తెచ్చుకున్నవి కాదు. వారికి తెచ్చిపెట్టినవి. అందుకే నటి ప్రియాంకా చోప్రా నా డాక్యుమెంటరీని చూసి తాను నిర్మాతగా మారి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఒక స్త్రీగా, ఆడపిల్ల తల్లిగా ఆమెకు స్త్రీల సాధికారత, ఆత్మగౌరవం గురించి అక్కర ఉంది. జెండర్ ఈక్వాలిటీ గురించి స్త్రీ, పురుషుల్లో చైతన్యం రావడానికి ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడుతుందని ఆమె విశ్వసిస్తున్నారు' అని తెలిపింది సృష్టి బక్షి.

కళను రాశి పోస్తోంది!





రాశి అగర్వాల్

ఒక రావు పేపర్ తయారు కావాలంటే పది లీటర్ల నీళ్లు కావాల్సి వస్తుంది. రాసుకోవడానికి ఒక రీము పేపర్ సిద్ధం అవ్వాలంటే పాతికేళ్లు పెరిగిన చెట్టు కొమ్మలను సమూలంగా నరకాలి. చెట్టును నరక్కుండా, నీటిని వృథా చేయకుండా ఒక డైరీ తయారయితే? అంతకంటే ఇంకేం కావాలి? ఇంతే కాదు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వృథాను హరాయించుకోవడానికి భూమాత పడే యాతన కూడా తగ్గిపోతుంది. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి తెర తీసింది సూరత్‌లో ఓ ఆర్కిటెక్ట్. స్టేషనరీ వస్తువులు, ఇంటీరియర్ డెకరేషన్‌ని కలగలుపుతూ చేసిన ప్రయోగమే రుహానీ రంగ్. ఆ ప్రయోగం వెనుక దాగిన నేపథ్యాన్ని వివరించింది రాశి అగర్వాల్. ఆమె మదిలో వెలిగిన ఈ ఆలోచన తొమ్మిది వేల కిలోల పత్తికి పుస్తక రూపాన్నిచ్చింది.

మనదేశంలో కళ ఉంది!

''నేను ఆర్కిటెక్చర్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మన సంప్రదాయ నిర్మాణాలు, కళలు, చేతివృత్తుల అధ్యయనం కోసం విస్తృతంగా పర్యటించాను. ఢిల్లీ నుంచి జైపూర్, అహ్మదాబాద్, కచ్, పాండిచ్చేరి నుంచి పూనా వరకు పరిశీలిస్తే మనదేశంలో రకరకాల కళలు, కళా నైపుణ్యాలున్న పని వాళ్లున్నారని తెలిసింది. వాళ్ల చేతుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదికలు తగినంతగా లేవు. అలాంటి ఒక వేదికను ఏర్పాటు చేసి, నా వృత్తిలో ఇంటీరియర్ డిజైనింగ్‌కు దోహదం చేసే విధంగా ఒక ప్రయోగం చేశాను. అది విజయవంతమైంది. రకరకాల కళలను ఒక వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 'రుహానీ రంగ్' పేరుతో ఆర్ట్ స్టార్టప్ మొదలు పెట్టాను. ప్లానర్ బుక్ కవర్ పేజీ మీద మధుబని ఆర్ట్ ఉంటే ఇంట్లో అందమైన షో పీస్ ఉన్నట్లే. ప్లానర్ బుక్‌ని కార్నర్ స్టాండ్‌లో అందంగా అమరిస్తే డ్రాయింగ్ రూమ్ కళాత్మకంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో హస్త కళలను పునరుద్ధరించగలుగుతున్నాను.



రుహానీ రంగ్‌ను ఐదు వేల రూపాయలతో మొదలు పెట్టాను. నాతో కలిసి 50 మంది కళాకారులు, 40 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. వస్త్రాలను తయారు చేసే భారీ పరిశ్రమలకు పెద్ద సంఖ్యలో పత్తి బేళ్లు వస్తుంటాయి. ప్రతి బేలు లోనూ మెషీన్‌లో అమరికకు తగినట్లు ఉపయోగించగా మిగిలిన పత్తి వృథా అవుతూ ఉంటుంది. అది భూమిలో కలిసి పోవాల్సిందే తప్ప మరో పనికి ఉపయోగించేవారు కాదు. ఎందుకూ పనికి రాదని వదిలేస్తున్న ఆ పత్తే నా కుటీర పరిశ్రమకు ముడిసరుకు. నాకు కోవిడ్ సమయం కూడా మంచే చేసింది. ఆ టైమ్‌లో పెద్ద చిన్న పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. హస్తకళాకారులు పని లేక ఆర్థికంగా మానసికంగా దెబ్బతిని ఉన్నారు. ఆ సమయంలో నేను ఒక్కొక్కరిని కలిసి నా ఆలోచన చెప్తుంటే వాళ్లు ఉత్సాహంగా నాకు మరికొన్ని ఐడియాలు చెప్తూ తమ అనుభవాన్ని జోడించారు. అలా 2020లో మొదలు పెట్టిన నా కుటీర పరిశ్రమ ఇంత వరకు హ్యాండ్ మేడ్ పేపర్‌తో ప్లానర్స్, క్యాలెండర్‌లు, నోట్‌బుక్స్, జర్నల్స్, స్కెచ్ బుక్స్ వంటి 15 వేల ఉత్పత్తులకు రూపమిచ్చింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే నలభై వేల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. ఆర్ట్ పీస్ కేవలం కళాభిరుచి, కళారాధన కోసమే కాదు. అది మన దైనందిన జీవితంలో భాగంగా మారాలి. అప్పుడే కళ ఎప్పటికీ నిలిచి ఉంటుంది'' అని వివరించింది రాశి అగర్వాల్.

సాగుబడి

కృత్తిక కార్తె : మే 11 నుంచి

సన్ బర్న్ ముప్పు!



- పండ్ల తోటలు, కూరగాయ తోటలకు ముప్పుగా మారిన ప్రచండమైన ఎండ
- అధిక ఉష్ణోగ్రతలతో పాటు తార స్థాయికి చేరిన లైట్ ఇంటెన్సిటీ, యు.వి. రేడియేషన్
- మామిడి, జామ కాయలు పక్వానికి రాక ముందే ఎర్రగా మారి రాలిపోవటం లేదా నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్న రైతులు
- రోజూ సాయంత్రం నీటిని, వారానికోసారి పోషకాలను చల్లమంటున్న 'ఆంగ్రూ' మాజీ డీన్ డా. పి.వి. రావు

ఈ వేసవిలో ఎల్‌నినో పుణ్యాన సాధారణం కన్నా ఐదారు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన తోటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ పండ్ల తోటలైన మామిడి, జామతో పాటు కూరగాయలు, డ్రాగన్ వంటి తోటలకు నిప్పుల కుంపటి వంటి వేడి ఒత్తిడి తీవ్ర సమస్యగా మారింది.

47 డిగ్రీలకు చేరిన పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత వల్ల భూమి విపరీతంగా వేడెక్కి రాత్రి 7–8 గంటల వరకు శగలు కక్కుతూ ఉంది. దీన్నే 'రిఫ్లెక్టెడ్ రేడియేషన్' అంటారు. పొలాల్లో కన్నా కాంక్రీటు అరణ్యాలుగా మారిన నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెట్లు, మొక్కలు వేర్ల ద్వారా తీసుకునే నీటి కన్నా ఎక్కువగా నీరు ఆవిరైపోతుండటం వల్ల లేత ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి. లేత కణాలు ఉంటాయి కాబట్టి లేత ఆకుల చివరలు మాడిపోతున్నాయి.

పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్షియస్ వరకు ఉన్న వాతావరణం పంటల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. 40 డిగ్రీలు దాటిన తర్వాత పంటలు, తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు 47 –48 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో కూరగాయ పంటలు, పండ్ల తోటలు సన్ బర్న్‌తో సతమతమవుతూ ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ పీవీ రావు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సాధారణంగా ఎండను రక్షణకు కొన్ని పంటలపై 50% సూర్యరశ్మిని ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌ను వాడుతుంటారు. అయితే, ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవటం వల్ల 80% ఎండను ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌లు వేసుకోవాల్సి వస్తోందని డా. పివి రావు అన్నారు.



సన్‌బర్న్‌కు గురైన మామిడి కాయ



సన్‌బర్న్‌కు గురైన జామ కాయ



సన్‌బర్న్‌కు గురైన డ్రాగన్ పంట

అల్ఫాన్సో, పచ్చడి కాయలు 80% రాలిపోతున్నాయి

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అల్ఫాన్సో, దేశీ పచ్చడి రకాల చిన్న కాయలు రాలిపోతున్నాయి. ఆర్గానిక్ మామిడి తోటల్లో గతంలో 10–20% రాలే కాయలు ఈ సీజన్‌లో 70–80% రాలిపోతున్నాయి. ఇతర రకాల్లో కూడా జనవరిలో వచ్చిన ఆఖరి పూత ద్వారా వచ్చిన చిన్న కాయలు ఎక్కువగా ఎండదెబ్బకు రాలిపోతున్నాయి. ఎండలు ముదిరే నాటికి నిమ్మకాయ సైజు ఉన్న కాయలకు ప్రాబ్లం లేదు. సన్‌బర్న్ సమస్య వల్ల కాయలు ఒకవైపు అకాలంగా రంగు మారిపోతుంటే, వెనుక వైపు మాత్రం పచ్చిగానే ఉంటున్నాయి. బంగనిపల్లి పూత రాలిపోవటంతో ఈ ఏడాది 20% కూడా కాయ మిగల్లేదు. దశేరి కాపు మాత్రం అన్నిచోట్లా బాగుంది. మామిడి చెట్లకు రోజూ నీరు స్ప్రే చేస్తున్నాం. చెట్ల కింద మల్చింగ్ చేసి నీటి తేమ ఆరిపోకుండా కాపాడుకుంటున్నాం. ఇదిలా ఉంటే, మధ్యప్రాచ్య దేశాల్లో యుద్ధం వల్ల నౌకల్లో వెళ్లే సరుకు విమానాల ద్వారా ఎగుమతి అవుతోంది. దీనికితోడు, దుబాయ్‌లో భారీ వరదల వల్ల అమెరికా తదితర దేశాలకు మామిడి పండ్ల ఎగుమతి ఈ ఏడాది బాగా దెబ్బతింది. గత 15 రోజుల్లో 350 ఎమిరేట్స్ విమానాలు రద్దయ్యాయి. దీంతో ఖతర్ తదితర దేశాల విమానాలు ధరలు పెంచేశాయి. అమెరికాకు కిలో మామిడి రవాణా చార్జీ రూ. 180 నుంచి 600కు పెరిగిపోయింది. అమెరికాలో 4 కిలోల మామిడి పండ్ల బాక్స్ గతంలో 40 డాలర్లకు అమ్మేవాళం. ఇప్పుడు 60–70 డాలర్లకు అమ్మాల్సివస్తోంది. దీంతో అమెరికాకు మామిడి ఎగుమతులు బాగా తగ్గిపోయాయి.

– రఫీ (98480 02221), సేంద్రియ మామిడి రైతు, ఎగుమతిదారు, ఏఆర్4మ్యాంగోస్, హైదరాబాద్



సూర్యకాంతి తీవ్రత

పంటలపై ప్రతికూల ప్రభావం ఎంతగా ఉందన్నది ఉష్ణోగ్రతతో పాటు సూర్యకాంతి తీవ్రత (లైట్ ఇంటెన్సిటీ)పై కూడా ఆధారపడి ఉంటుందని డా. రావు వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న రోజుల్లో చదరపు మీటరుకు 20,000 – 25,000 కిలో లక్స్ వరకు సూర్యకాంతి ఉంటుంది. వేసవిలో సాధారణంగా ఇది 80,000 కిలో లక్స్‌కు పెరుగుతూ ఉంటుంది. అయితే, ఈ ఏడాది ఇది విపరీతంగా పెరిగి, ఏకంగా 1,20,000 కిలో లక్స్‌కు చేరటం పండ్ల తోటలకు, కూరగాయల పంటలకు ముప్పుగా మారిందని డాక్టర్ పి వి రావు తెలిపారు.

ఫొటో ఆక్సిడేషన్ వల్ల ఆకులలో కిరణజన్య సంయోగ క్రియ సజావుగా జరగటం లేదు. లేత ఆకుల్లో క్లోరోఫిల్ మాలిక్యూల్ చిట్లిపోవటం వల్ల ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు జీవం కోల్పోయి పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయన్నారు.

తారస్థాయికి చేరిన యువి రేడియేషన్

అతినీలలోహిత కిరణాల (యువి) రేడియేషన్ సూచిక సాధారణంగా 3–4 వరకు ఉంటుంది. వేసవిలో ఈ సూచిక 8–9 వరకు పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఇది 12కు పెరగటంతో సూర్యరశ్మిని పంటలు, తోటలు తట్టుకోలేకుండా ఉన్నాయని డా. పి వి రావు వివరించారు. మామిడి, జామ తదితర కాయలు ఎండ పడిన చోట ఎర్రగా మారి దెబ్బతింటున్నాయి. వెనుక వైపు పచ్చిగానే ఉంటూ ఎండ సోకిన దగ్గర రంగు మారుతుండటంతో పండ్లు నాణ్యతను కోల్పోతున్నాయి. అల్ఫాన్సో, పచ్చడి రకాల మామిడి కాయలు బాగా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

నీరు, పోషకాలు పిచికారీ చేయాలి



విపరీత ఉష్ణోగ్రతలకు తోడైన వడగాడ్పులకు కూరగాయ తోటలు, పండ్ల తోటల్లో లేత ఆకులు మాడిపోతున్నాయి. ఉష్ణోగ్రత, అతినీలలోహిత వికిరణాలతో పాటు సూర్యరశ్మి తీవ్రత చాలా పెరిగిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయటం ద్వారా పంటలకు రక్షించుకోవచ్చు. వారం, పది రోజులకోసారి ఇంటిపంటలపై నానో యూరియా/వర్మీవాష్/జీవామృతం/ఆవు మూత్రంను ఒకటికి పది (1:10) పాళ్లలో నీటిలో కలిపి పిచికారీ చేసుకొని, అతి వేడి వత్తిడి నుంచి తోటలకు ఉపశమనం కలిగించాలి.

– డాక్టర్ పి.వి. రావు (94901 92672), రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్

యు.వి. రేడియేషన్ పండ్లను దెబ్బతీస్తోంది!

అతి నీలలోహిత వికిరణాల (యు.వి. రేడియేషన్) తీవ్రత బాగా పెరిగిపోయి మామిడి, జామ పండ్లు ఎండదెబ్బకు గురవుతున్నాయి. యు.వి. రేడియేషన్ ఏప్రిల్ ఆఖరి, మే మొదటి వారాల్లో తీవ్రస్థాయికి చేరింది. యు.వి. ఇండెక్స్ ఇప్పుడు 12–13కి పెరిగిపోయింది. మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో కాయలపై ఎండ మచ్చలు ఏర్పడుతూ పండ్ల నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. టొమాటోలు వంటి కూరగాయలపై కూడా ఈ ఎండ మచ్చలు సమస్యగా మారాయి. ఎండ తగిలిన వైపు పండినట్లు రంగు మారుతుంది. వెనుకవైపు పచ్చిగానే ఉంటుంది. నాణ్యత కోల్పోయిన ఈ కాయలను కొయ్యలేక, చెట్లకు ఉంచలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వేడికి అనేక పోషకాలు అందక కొన్ని కాయలు రాలిపోతున్నాయి. యు.వి. రేడియేషన్ ఉద్యాన తోటల రైతులను ఈ ఏడాది చాలా నష్టపరుస్తోంది. నత్రజని కోసం ఫిష్ అమినో యాసిడ్ లేదా పంచగవ్యలను ద్రవజీవామృతంతో కలిపి చల్లాలి. బోరాన్ కోసం జిల్లేడు+ఉమ్మెత్త కషాయం, పొటాష్ కోసం అరటి పండ్ల (తొక్కలతో కలిపి తయారు చేసిన) కషాయాన్ని పిచికారీ చేయాలి.

– ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు (76598 55588), తెలంగాణా గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం

పోషకాలు, హార్మోన్ అసమతుల్యత

వేసవిలో టొమాటో, మిర్చి వంటి కూరగాయ పంటల మొక్కలు నాటుకునేటప్పుడు వీటికి ఉత్తర, దక్షిణ వైపున నీడనిచ్చే మొక్కలను వేసుకుంటే ఎండ బారి నుంచి కొంత మేరకు కాపాడుకోవచ్చు. ఉదాహరణకు.. టొమాటో మొక్కలు ఉత్తర దక్షిణాల్లో మొక్కజొన్న లేదా ఆముదం మొక్కలు వత్తుకోవాలి. వడగాలుల నుంచి పంటలను రక్షించుకోవటానికి పొలం సరిహద్దుల్లో విండ్ బ్రేకర్‌గా పనికొచ్చే ఎత్తయిన చెట్లు పెంచుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న వారి తోటలు ఉపశమనం పొందుతాయి.

దాదాపు మరో నెల రోజులు మండే ఎండలు కొనసాగే పరిస్థితి ఉండటంతో తోటలకు చాలినంతగా నీటి తడులు ఇవ్వటంతో పాటు, చెట్లపైన కూడా సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయాలి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ నేల నుంచి వేర్ల ద్వారా పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గుతుందని, అందుకు తగినట్లు నీరు, పోషకాలు సైతం అందిస్తే తోటలకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ పివి రావు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కాలంలో పంటలు పోషకాలను నేల నుంచి తీసుకోవటంలో ఇబ్బంది వస్తుంది. జింక్ లోపం ఏర్పడుతుంది. హార్మోన్లను కూడా చెట్లు, మొక్కలు తయారు చేసుకోలేవు. హార్మోన్ అసమతుల్యత ఏర్పడుతుంది.

ఎండ తీవ్రతకు రెస్పిరేషన్ రేటు ఎక్కువ అవటం వల్ల కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారయ్యే పిండి పదార్థం మొక్క/చెట్టు నిర్వహణకే సరిపోతాయి. పెరుగుదల లోపిస్తుంది. అదనపు పిండిపదార్థం అందుబాటులో వుండక పూలకు, కాయలకు పోషకాలను అందించలేని సంక్షోభ స్థితి నెలకొంటుంది. అందువల్ల పూలు, కాయలు రాలిపోయే పరిస్థితి ఎదురవుతుంది.

అతి వేడి వత్తిడి ఎదుర్కొంటున్న మామిడి తోటలపై జింక్, ప్లానోఫిక్స్, బోరాన్‌లను సాయంత్రం 3 గంటల తర్వాత పిచికారీ చేయాలి. టొమాటో, మిరప, వంగ తదితర కూరగాయ మొక్కలపైన నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్‌ను 5 లీటర్ల నీటికి 1.5 నుంచి 2 ఎం.ఎల్. మోతాదులో కలిపి పిచికారీ చేయాలని డా. రావు తెలిపారు.



టొమాటో పంటకు షేడ్‌నెట్

సేంద్రియ సేద్యం, వ్యాపార నైపుణ్యాలపై 6 రోజుల శిక్షణా శిబిరం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను సేంద్రియ వ్యవసాయంలో మెళకువలు నేర్పటంతో పాటు.. సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార అవకాశాలను సృష్టించటంలో నిపుణులైన ఫెసిలిటేటర్‌గా మారడానికి నైపుణ్యం, విజ్ఞానాభివృద్ధి శిక్షణా కోర్సును నిర్వహించనుంది కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ. 20 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయ శిక్షణలో విశేష కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సారథ్యంలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో సకల వసతులతో కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ అంతర్జాతీయ స్థాయి వసతులతో ఇటీవలే ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేయటంతో పాటు సేంద్రియ వ్యవసాయం, వ్యాపారం తదితర అంశాలపై ప్రామాణికమైన శిక్షణ ఇవ్వటమే ఈ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల తోడ్పాటుతో మే 22 నుంచి 27 వరకు తెలుగులో నిర్వహించనున్న ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డా. రామాంజనేయులు తెలిపారు. గుగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు విధిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవటం తప్పనిసరి. 30–35 మందికి మాత్రమే అవకాశం.

ఇతర వివరాలకు.. 85002 83300.
www.krishnasudhaacademy.org

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్